క్లుప్తంగా

ఆదిశంకరాచార్య విగ్రహావిష్కరణ



ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్వరూపానందేంద్రసరస్వతి

సింహాచలం: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ దరి శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రీదేవి ఆలయ 13వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదిశంకరాచార్యుల విగ్రహావిష్కరణ సోమ వారం ఘనంగా జరిగింది. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఉద యం విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం హారతులు అందజేశారు. ఆలయ ధర్మకర్త నరసింహమూర్తి, టీడీపీ నాయకుడు శానాపతి శంకరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నమో శివరుద్రాయ

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేషంగా పూజలు, అభిషేకాలు జరిగాయి. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులు తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. మారేడు దళాలతో స్వామికి అర్చన చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు కార్యక్రమం నిర్వహించారు.

3,970 మంది విద్యార్థులకు కానుక



జగనన్న విద్యాకానుక కిట్‌లతో సబ్బవరం కేజీబీవీ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3,970 మంది విద్యార్థులకు జగనన్నకానుక కిట్లు అందజేయనున్నట్టు ఎంఈవో ఎస్. అప్పలరాజు తెలిపారు. కిట్‌లలో విద్యార్థులకు అవసరమయ్యే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు,సూస్,సాక్సులు,బెల్టులు ఉంటాయని చెప్పారు.

పాలిటెక్నిక్ అభ్యర్థులకు అవగాహన



పాల్గొన్న అభ్యర్థులు, తల్లిదండ్రులు

సింహాచలం: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెకానికల్ ఇంజినీరింగ్ సెక్షన్ రిటైర్డ్ హెడ్ సీహెచ్ రాంజీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిప్లమో ఎడ్యుకేషన్‌పై అభ్యర్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. డిప్లమో పూర్తి చేసిన వారికి ఏయే ఉద్యోగ అవకాశాలు ఉంటాయో వివరించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కానుక.. వేడుక

జగనన్న విద్యా కానుక పంపిణీతో ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పండగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రెట్టించిన ఆనందంతో కార్యక్రమానికి తరలివచ్చారు. జగనన్న విద్యా కానుక కిట్‌లో యూనిఫాం, షూ, బెల్టు, బ్యాగు తదితర సామగ్రి చూసి విద్యార్థులు పులకించిపోయారు. థ్యాంక్యూ జగన్ మావయ్య అంటూ కృతజ్ఞతలు తెలిపారు. నాణ్యమైన విద్యకు ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

- పాఠశాలల్లో పండగ వాతావరణం
- విద్యార్థులకు జేవీకే కిట్ల అందజేత
- ఆనందంలో విద్యార్థులు, తల్లిదండ్రులు



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాసరావు



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న అప్పలరాజు

పరవాడ: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం ద్వారా తీర్చిదిద్దిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 3నుంచి10 తరగతుల విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్లను ఆయన సోమవారం విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మ ఒడి, నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, వసతి దీవెన వంటి అనేక పథకాలను అమలు చేస్తూ విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. జగనన్న విద్యా కానుక పథకం విద్యార్థుల పాలిట ఒక వరమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

- వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో మండల ఉపాధ్యక్షుడు బి.అప్పలరాజు విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పెదపూడి పద్మావతి, హెచ్ఎం పి.కనకేశ్వరరావు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురదరాజు, కమిటీ ప్రతినిధి నిర్మల, ఉపాధ్యాయులు రమేష్‌బాబు, అప్పలనాయుడు, కూర్మారావు, అన్నాజీరావు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌పురంలో కిట్లు అందజేస్తున్న ఎంపీపీ నాగమణి

సింహాచలం: జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం పెందుర్తి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేశారు. ఎస్ఆర్‌పురం ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు ఎంపీపీ మధుపాడ నాగమణి కిట్లు పంపిణీ చేశారు. –97వవార్డు చినముషిడివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కిట్లను కార్పొరేటర్ శానాపతి వసంత విద్యార్థులకు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మణి, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. చినముషిడివాడ స్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్లను 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ పంపిణీ చేశారు.

అన్ని పాఠశాలలకు కానుక



జగనన్న విద్యా కానుక కిట్లను మండలంలో అన్ని పాఠశాలలకు సరఫరా చేశాం. మండంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5188 మంది విద్యార్థులకు కిట్లు ఆయా పాఠశాలలకు పంపించాం. ఒక్కో విద్యార్థికి 3 జతల యూనిఫారం, జత బూట్లు, 2 జతల సాక్సులు, నోటు పుస్తకాలు, టెక్ట్స్ బుక్స్, నిఘంటువు, బ్యాగు, బెల్ట్ అందజేస్తాం.

– ఎం.సునీత, ఎంఈవో, పరవాడ

మా అభిరుచి జగన్‌మామకు తెలుసు



విద్యా కానుకలో భాగంగా విద్యార్థులకు సమకూర్చిన యూనిఫాం ఆకర్షణీయంగా అందంగా ఉంది. కార్పొరేట్ పాఠశాలల యూనిఫాంను తల దన్నే విధంగా ఉన్నాయి. చాలా ఆనందంగా ఉంది. మా జగన్‌మామయ్యకు మా అభిరుచు తెలుసు.

– వంది భార్గవి, టెన్త్ క్లాస్, వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాల

గతానికి భిన్నంగా సౌకర్యాలు



గతానికి భిన్నంగా సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వానికి విద్యార్థులంతా రుణపడి ఉంటాం. అందమైన దుస్తులు, నాణ్యమైన, రుచికరమైన ఆహారం, చదువుకు ఆర్థిక సహకారం అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి మా ధన్యవాదాలు

– హేమంత్ కుమార్, టెన్త్ క్లాస్, వాడచీపురుపల్లి, జెడ్పీ పాఠశాల

ఇబ్బందులు తప్పాయి



గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన పుస్తకాలను మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి తేవడానికి ఎంతో కష్టపడేవాళ్లం. ఇప్పుడు నేరుగా పాఠశాలలకే పుస్తకాలు సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు తప్పాయి. సంతోషంగా ఉంది. పాఠశాల ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్‌లు అందించడం ఆనందంగా ఉంది.

– పల్లి అప్పలనాయుడు, తెలుగు ఉపాధ్యాయుడు, జెడ్పీ పాఠశాల, వాడచీపురుపల్లి

పది టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు

సబ్బవరం: గ్రామీణ ప్రాంతంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహ బహుమతులు అందజేయడం అభినందనీయమని రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్ రిటైర్డ్ హెచ్ఎం బొబ్బిలి శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక ప్రతిభ విద్యాలయంలో ఈ ఏడాది పదోతరగతిలో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన కొటాన నాగరూప్సీరాణి (584), ముమ్మన నదియా (583) ప్రసన్న(582), ఎల్. గిష్మతేజశ్విని (581)లకు నగదు ప్రోత్సాహక బహుమతుల కింద వరుసగా రూ. లక్ష, రూ.50 వేలు, రూ.25 వేలు, రూ. 10 వేలు, 500 మార్కులు దాటిన విద్యార్థులకు 72 మందికి రూ.2 వేల చొప్పున అందజేశారు. స్కూల్ కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు అంకిత భావం ఎక్కువని, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ ఏడాది నుంచి భారీ నగదు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అన్సీజోసెఫ్, కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు



విద్యార్థి నాగరూప్సీరాణికి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపాల్ అన్సీజోసెఫ్, ఆదిరెడ్డి రమణ

సాయిబాబా ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పరవాడ: మండలంలోని పి.బోనంగి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి సర్పంచ్ బండారు కల్పనరాజశేఖర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి ముందడుగు వేసిన ఎలక్ట్రికల్ యూత్ సభ్యులను ఆమె అభినందించారు. ఆలయ నిర్మాణానికి తమ సహాయ సహకారాలు ఉంటాయని సర్పంచ్ కల్పన రాజశేఖర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జె.శ్రీను, గుండు లోకేష్, గొంతిన దుర్గాప్రసాద్, కలిదిండి శ్రీనివాసరావు మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు, కలిదిండి రామకృష్ణరాజు, బండారు బోయన్న, మంగాల సూరిబాబు, గొంతిన రాము పాల్గొన్నారు.

‘ప్రజల ఆకాంక్షకు కేంద్ర ప్రభుత్వం విలువివ్వాలి’

కూర్మన్నపాలెం: రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. ప్రజల ఆకాంక్షకు కేంద్ర ప్రభుత్వం విలువనిచ్చి విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా పార్లమెంట్‌లో ప్రకటన చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 851వ రోజు, సోమవారం వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. ఇన్ని రోజులుగా కార్మికులు ఉక్కు కర్మాగారం గురించి పోరాడుతున్నా ప్రధాని మోదీ ఈ విషయం ప్రస్తావించకపోవడం సరికాదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థపై పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీకాలనీ: ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ప్రో చైల్డ్ గ్రూప్, విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ రూపొందించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ భవన కార్యాలయంలో విశాఖ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి డి.వెంకటేశ్వరి ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సమష్టి కృషితోనే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సున్న పిల్లలు పనిచేయకూడదని చట్టంలో ఉందన్నారు. దాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరముందని వెల్లడించారు. ఎవరైనా ఈ చట్టాన్ని అతిక్రమిస్తే శిక్షార్హులన్నారు. ఈ కార్యక్రమంలో ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి, ఏపీ ప్రో చైల్డ్ గ్రూప్, విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారులకు పదోన్నతులు కల్పించాలి



స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం గాంధీను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారులకు పదోన్నతులు కల్పించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు సంస్థ హెచ్ఆర్ సీజీఎం జి. గాంధీని కోరారు. హెచ్ఆర్ సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం అసోసియేషన్ నాయకులు ఉక్కు పరిపాలన భవనంలో ఆయనను కలిసి, అభినందించారు. వారు మాట్లాడుతూ జేవో నుంచి ఏఈ పదోన్నతులు కొంతమందికి ఐదేళ్ల బదులు ఆరేళ్లకు ఇచ్చారన్నారు. ఈ అంశాన్ని నాటి జాతీయ ఎస్టీ కమిషన్ నందకుమార్ సాయి దృష్టికి తీసుకురాగా వారి ఆదేశాలతో మాజీ సీఎండీ, పర్సనల్ డైరెక్టర్లు తదుపరి పదోన్నతుల్లో నష్టాన్ని భర్తీ చేయడానికి అంగీకరించారన్నారు. నాలుగేళ్లుగా అధికారులకు పదోన్నతులు లేకపోవడం వల్ల సీజీఎం స్థాయిలో ఒక్క ఎస్సీ, ఎస్టీ అధికారి కూడా లేరన్నారు. ఛార్జిమెన్ నుంచి జేవో పదోన్నతుల కోసం వెంటనే పరీక్ష నిర్వహించాలని, వరల్డ్ ట్రైబల్ డేను యాజమాన్యం అధికారికంగా నిర్వహించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు బి.తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎస్. సత్యనారాయణ, ఎల్.వి. రమణ, ఎస్. మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన

పెదగంట్యాడ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన లభించింది. మేళాను ఐఎంసీ చైర్మన్ ఏకే బాలాజీ ప్రారంభించారు. ఈ మేళాకు 19 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. 182 మంది అభ్యర్థులు ఈ మేళాకు హాజరు కాగా, అందులో 71 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో ముగ్గురు మహిళా అభ్యర్థులు ఉన్నారన్నారు. విసూవిఎస్ ఇండియా లిమిటెడ్, మైలాన్ లాబొరేటరీస్, సినర్జీస్ అండ్ కాస్టింగ్‌కు ఎక్కువమంది ఎంపికయ్యారని పేర్కొన్నారు.

మనసుకు ఆనందాన్నిచ్చేది కవిత్వం



సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామితో కవులు, రచయితలు

సీతంపేట: కవిత్వం వింటే మనసుకు ఆనందం కలగాలని లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితానగర్ లలితా పీఠం దర్బారు హాల్లో సోమవారం సాయంత్రం కవి సమ్మేళనం జరిగింది. అనంతరం కవులు, రచయితలను ఉద్దేశించి స్వామి వారు అనుగ్రహ భాషణం చేశారు. ఆనందం అంటే మనసు పరవశించే స్థితని పేర్కొన్నారు. అందరి ఆనందాల కంటే బ్రహ్మానందం గొప్పదని, కవిత్వం, సంగీతం, లలిత కళల వల్ల కలిగే ఆనందం ఇంచుమించు బ్రహ్మానందంతో సమానమన్నారు. మనిషి ఎన్ని క్షణాలు ఆనందాన్ని అనుభవించాడో అదే నిజమైన జీవితమని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో చక్కని పద్య, గద్య కవిత్వంతో అలరించారన్నారు. ఆగస్టు 10న లలితా పీఠంలో నన్నయ్య సహస్రాబ్ది ఉత్సవాలు జరుపుకుందామని తెలిపారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి మహాస్వామిని, రచయితలు, కవులు డి.వి.సూర్యారావు, టి.పి.ఎస్.ఆచార్యులు, శేఖరమంత్రి ప్రభాకర్, చింతా ప్రభాకరరావు, రామతాత, చిన సూర్యనారాయణ, కావ్య, పిళ్లా రమణమూర్తి, క్లోపల్లి వరలక్ష్మి, మరడాన సుబ్బారావు, నరసింహారావు, పద్మజ పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్‌లోనే తేజ మృతి!

- న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన
- అన్ని కోణాల్లో విచారించి న్యాయం చేస్తామని సీఐ హామీ



ఆందోళన చేస్తున్న తేజ బంధువులు

సింహాచలం: నాలుగు రోజుల క్రితం పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బాలుడు పల్లా తేజ(5) కేసులో కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. బాలుడు స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి చనిపోయినట్టు పోలీసులకు సమాచారం అందింది. తేజ చేతిపై గాట్లు కనిపించడంతో పాము కరిచి మృతి చెంది ఉంటాడని పోలీసులు తొలుత భావించారు. అయితే తేజ తల్లి ఎవరైనా చంపేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేయడంతో ఆ కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్న పెందుర్తి పోలీసులకు తేజ స్విమ్మింగ్‌పూల్‌లో పడి మృతి చెందాడని సమాచారం తెలిసింది. దీంతో పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎస్ఆర్ పురంలో ఉంటున్న పల్లా కనకరాజు, నారాయణమ్మ ఐదేళ్ల కుమారుడు పల్లా తేజ ఈనెల 8న సాయంత్రం 5 గంటల సమయంలో ఆడుకునేందుకు ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికారు. జాడతెలియకపోవడంతో ఆరోజు రాత్రి 9.30 గంటల సమయంలో పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆ రోజు రాత్రి గ్రామస్తులు, తేజ కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులు గ్రామంలో వెతికినా ఆచూకీ కానరాలేదు. 9వ తేదీ ఉదయం 5.20 గంటల సమయంలో తేజ ఎస్ఆర్‌పురం గ్రామంలోని పల్లా అప్పలనాయుడుకు చెందిన స్థలంలో శవమై కనిపించాడు. చేతిపై రెండు గాట్లు ఉండడంతో పాము కరిచినట్టు పోలీసులు ప్రాథమికంగా భావించారు. అయితే తేజ తల్లి మాత్రం తన కొడుకుది హత్య అని ఆందోళన వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఇదిలావుండగా ఎస్ఆర్‌పురంలోని లెండీ వనం రిసార్టులో పనిచేస్తున్న తాడి నారాయణ అనే వాచ్‌మెన్ సోమవారం మధ్యాహ్నం ఒమ్మి సోంబాబు అనే వ్యక్తికి ఫోన్ చేసి తాము లేని సమయంలో తేజ స్విమ్మింగ్ పూల్‌లో దిగి మృతి చెందాడని తెలిపాడు. సోమవారం ఈ విషయం వెలుగులోకి రావడంతో స్థానికంగా సంచలనం రేకెత్తించింది. దీంతో తేజ బంధువులంతా తమకు న్యాయం చేయాలని పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. అన్ని కోణాల్లో విచారించి న్యాయం చేస్తామని సీఐ అప్పారావు తెలిపారు.

కాగా తేజ స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చెందాడని చెబుతున్న వాచ్‌మెన్ నారాయణ రెండు రోజులపాటు ఎవరికీ కనిపించకుండా వెళ్లిపోయినట్టు సమాచారం. తేజ మృతదేహాన్ని నారాయణే తీసుకొచ్చి అప్పలనాయుడు స్థలంలో పడేశాడన్న ప్రచారం కూడా జరుగుతోంది. సోమవారం పోలీసులను కలిసిన నారాయణ బాలుడు స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చెందాడని చెప్పినట్టు తెలుస్తోంది.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



అప్పన్న సన్నిధిలో ముత్తంశెట్టి



రూప మిశ్రాకు అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, స్వచ్ఛభారత్ మిషన్ సంయుక్త కార్యదర్శి రూప మిశ్రా దర్శించుకున్నారు. వీరి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు అందజేశారు.

వైభవంగా అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ట

- రూ.లక్ష విరాళం అందజేసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్



కమిటీ పెద్దలకు విరాళం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ నిర్మాణం కోసం తన వంతు సాయంగా రూ. లక్ష చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలుతో పాటు మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తదితరులు అభయాంజనేయస్వామిని దర్శించుకొని పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో పరిసర గ్రామాల భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి నాగార్జున, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఇతర నాయకులు

- మంత్రి మేరుగు నాగార్జున

పరవాడ: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి మంత్రి నాగార్జున ఆవిష్కరించారు. అనంతరం మంత్రి నాగార్జున మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన రాష్ట్రంలో ఇటువంటి సంక్షేమ పాలనను ఎన్నడూ చూడలేదని మంత్రి నాగార్జున పేర్కొన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ఓ వర్గానికో, మతానికో ఆపాదించడం సబబు కాదన్నారు. అంబేడ్కర్ అందరి వాడని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.పూర్ణానందశర్మ, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, దళిత నాయకులు బూసి వెంకటరావు, ఎల్వీ రమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, యలమంచిలి అప్పారావు, ఎం.శ్రీనివాసరావు, దేవిరెడ్డి రమణ, సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.